

భోగాపురం వద్ద మహేంద్రతనయాలో ఇసుక లోడింగ్

తవ్వేసి.. తరలించి..

- మహేంద్రతనయ నుంచి ఇసుక అక్రమ రవాణా
- తాగునీటి పథకాలకు పొంచి ఉన్న ముప్పు
- అయినా పట్టించుకోని అధికారులు



చినకోష్ట వద్ద మహేంద్రతనయ నదిలో ఇసుక సేకరిస్తున్న కూలీలు

(హరిపురం)

మహేంద్రతనయా నది ఇసుకాసురులకు ప్రధాన ఆదాయ వనరుగా మారింది. ప్రజాప్రయోజనాల దృష్ట్యా 20 ఏళ్లుగా ఈ నదిలో ఇసుక తవ్వకాలను ప్రభుత్వం నిషేధించింది. కాగా.. గత వైసీపీ ప్రభుత్వం ఇసుక ధరలను అమాంతం పెంచేసింది. దీంతో అక్రమార్కుల కన్ను మహేంద్రతనయా నదిపై పడింది. స్థానిక నాయకుల ప్రోద్బలం, కొంతమంది అధికారుల సహకారంతో గత ఐదేళ్లు ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా.. ఇప్పటికీ అక్రమ తవ్వకాలు కొనసాగుతుండడం చర్చనీయాంశమవుతోంది.

● మందస, సోంపేట మండలాల పరిధిలో విస్తరించి ఉన్న మహేంద్రతనయా నది నుంచి సాయంత్రం నుంచి రాత్రివేళల్లో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. రెవెన్యూ, పోలీస్ శాఖల్లో కొంతమంది అధికారులకు మామూళ్లు ముట్టజెప్పడంతో ఇసుక అక్రమ దందాకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. మందస, సోంపేట మండలాల పరిధిలో చినకోష్ట, పెదకోష్ట, బాతుపురం, భోగాపురం, పొత్తంగి, సిరిపురం, బుషాపద్ర, దొంగల మారికానా, శాసనం, గౌడుగురండి, బారువా. మూలపొలం, టి.శాసనం తదితర ప్రాంతాల నుంచి అక్రమ రవాణా జోరుగా కొనసాగుతోంది. చిన్నకోష్ట, గౌడగురండి, భోగాపురం వంటి గ్రామాల్లో.. గ్రామ సంఘాలు ఏర్పాటు చేసి ట్రాక్టర్‌కు రూ.400 నుంచి 500 వరకు వసూళ్లు చేస్తున్నారు. ఆయా గ్రామ సంఘాలు, ట్రాక్టర్ల యజమానుల నుంచి అధికారులకు మామూళ్లు అందుతుండడంతో వీటివైపు కనీసం కన్నెత్తి చూడడంలేదు.

ప్రభుత్వ నిర్మాణాలకు..

ఐటీడీఏ పరిధిలోని మందస, సోంపేట, మెళియాపుట్టి, పలాస వంటి పలు మండలాల్లో సుమారు రూ.40కోట్లతో పాఠశాల భవనాలు, ఇతర ప్రభుత్వ భవనాల నిర్మాణాలు చేపడుతున్నారు. వీటన్నింటికీ మహేంద్రతనయా నది ఇసుకనే వినియోగిస్తున్నారు. ఈ విషయం ఇక్కడి అన్ని స్థాయిల్లోని అధికారులకు తెలిసినా కిమ్మనడంలేదు. మహేంద్రతనయా నది ఇసుకతో గతంలో ప్రభుత్వానికి ఏటా కోట్లాది రూపాయల ఆదాయం వచ్చేది. ఇక్కడ ఇసుక వేలంను ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం రద్దు చేసింది. దీనినే అదునుగా తీసుకున్న అక్రమార్కులు స్థానిక నాయకుల దన్నుతోనే ఇసుక దందాను సాగిస్తూ.. రూ.కోట్లకు పడగలెత్తుతున్నారు.

రోజుకు 150 ట్రాక్టర్లుకు పైనే..

మహేంద్రతనయా నదినుంచి రోజుకు 150 నుంచి 200 ట్రాక్టర్లు వరకు ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. ఒక్కో ట్రాక్టరుకు రెండు క్యూబిక్ మీటర్లు ఇసుక లోడ్‌చేసినా కనీసం ధర రూ.1550 అవుతోంది. కాగా.. కేవలం రూ.400 చెల్లించి గృహ నిర్మాణదారునికి లోడు రూ.4000 చొప్పున విక్రయిస్తున్నారు. ఇలా రోజుకు ఒక్కొక్కరూ కనీసం రెండులోడ్లు వేసి.. ఖర్చులు పోనూ రూ.6వేలకుపైగా సంపాదిస్తున్నారు. దీంతో ప్రభుత్వాదాయానికి గండిపడడమే కాకుండా సుమారు రూ.40కోట్లతో నిర్మించిన ఉద్దానం ప్రాజెక్టు, మరో రూ.20కోట్లుతో నిర్మించిన 19 చిన్న రక్షితనీటి పథకాల మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదం నెలకొంది. ఇప్పటికే సముద్ర నీరు ఉద్దానం మంచినీటి బావుల్లోకి వెళ్లి రెండు బావులు మూసివేశారు. మరో రెండు రక్షితనీటి పథకాలు మూలన పడ్డాయి. ఈ ఇసుక అక్రమ రవాణా ఇలాగే కొనసాగితే మంచినీటి పథకాలకు ముప్పు వాటిల్లడంతోపాటు నదీ పరివాహక ప్రాంతాల్లోని సుమారు 130గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటి మంచినీటికే ముప్పు ఏర్పడనుంది. ప్రభుత్వం, అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది.



బుడార్సింగిలో ఇసుక నిల్వలు డంప్..

సెబ్ రద్దు

- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ
- ఎక్సైజ్ శాఖ ప్రక్షాళనకు చర్యలు
- 250 మంది మళ్లీ ప్రొహిబిషన్ శాఖకు..



ఇచ్ఛాపురంలోని సెబ్ కార్యాలయం

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)ను ఎట్టకేలకు రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. గత వైసీపీ ప్రభుత్వం సెబ్‌ను ప్రారంభించి.. ఐదేళ్లలో ఎక్సైజ్ శాఖను భ్రష్టు పట్టించేసింది. పేరుకే ఎక్సైజ్‌ను ఉంచి.. అందులో ఉన్న అధిక సిబ్బందిని పోలీసులతో కలిసి పనిచేసేందుకు సెబ్‌గా ఏర్పాటు చేసింది. ఎక్సైజ్ శాఖలో జిల్లాకు సంబంధించి సుమారు 55 మంది సిబ్బంది మాత్రమే ఉన్నారు. 250 మంది సిబ్బంది 'సెబ్'లో పనిచేస్తు న్నారు. సెబ్ ఏర్పాటుతో నకిలీ మద్యం.. సారా విక్రయాలు.. ఇటువంటివన్నీ అరికడతారని గత ఐదేళ్ల ప్రజలు భావించారు. కానీ సెబ్ ఆధ్వర్యంలో పెత్తన మంతా పోలీసులు చేస్తూ.. కేవలం సారా నిర్మూలన కోసమే అన్నట్టు సెబ్ అధికారులు వ్యవహరించారు. ఏజెన్సీ గ్రామాల్లో దాడులు చేస్తూ నాటుసారా స్థావరాలు.. బెల్లం ఊటలను ధ్వంసం చేసేవారు. గ్రామాల్లో బెల్ట్‌షాపుల జోలికి మాత్రం వెళ్లలేదనే విమర్శలు ఉన్నాయి. మరోవైపు సొంత బ్రాండ్లతో నాసిరకం మద్యాన్ని విక్రయించి.. మందుబాబుల ఆరోగ్యంతో వైసీపీ ప్రభుత్వం చెలగాట మాడిందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం.. ఎక్సైజ్ శాఖ ప్రక్షాళనలో భాగంగా 'సెబ్'ను రద్దు చేసింది. ఈ మేరకు సెబ్‌లో ఉన్న 250 మంది సిబ్బంది మళ్లీ ఎక్సైజ్ శాఖ విధుల్లో చేరనున్నారు. అలాగే ఇదివరకు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్, డిపో మేనేజర్ ఒక వ్యక్తే విధులు నిర్వహించేవారు. ఈ రెండు విభాగాలకు అతిత్వరలో వేర్వేరు అధికారులను నియమించనుంది. ప్రస్తుతమున్న జిల్లా ఎక్సైజ్ విభాగ కీలక అధికారిపై ఆరోపణలు వెల్లువెత్తుతుండడం.. ఆయన ఓ ఔట్‌సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్‌తో అంటకాగి రవాణా చార్జీల్లో అక్రమాలకు పాల్పడుతున్నారని ప్రభుత్వానికి ఇటీవల ఫిర్యాదు చేరింది. రెండు రోజుల్లో జిల్లా ఎక్సైజ్‌లో కీలక ఉన్నత అధికారిపై బదిలీవేటు పడనుందని విశ్వసనీయ సమాచారం. అలాగే గత ప్రభుత్వ హయాంలో కాంట్రాక్ట్ కుదుర్చుకున్న కంపెనీల నుంచే మద్యం.. అదీ గత ఐదేళ్లలో పుట్టుకొచ్చిన మద్యం మాత్రమే అందుబాటులో ఉంచేవారు. ఇకపై బ్రాండెడ్ మద్యం నాణ్యమైనది అందుబాటులోకి రానుంది. గత ప్రభుత్వ విధానం వల్ల ఉదాహరణకు ఇంపీరియల్ బ్లూ వంటి మద్యం సీసా రూ.220కు లభించేది. అయితే ధర ఎక్కువగా ఉన్నా.. ఈ మద్యం లభించడం తక్కువగా ఉండేది. ఇటీవల ఇంపీరియల్ బ్లూ మద్యం సీసాను దుకాణాల్లో రూ.180కు విక్రయించేందుకు ప్రభుత్వం కాంట్రాక్టు కుదుర్చుకుందని విశ్వసనీయ సమాచారం. అతిత్వరలో 2014 నుంచి 2019 వరకు అందుబాటులో ఉన్న ప్రముఖ బ్రాండెడ్ మద్యం ఇకపై లభించనుంది. మందుబాబులకు నాణ్యమైన మద్యం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

జిల్లా ఆర్థిక ప్రగతికి సహకరించండి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 11: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, సమాజ అర్థికాభివృద్ధితోపాటు జిల్లా ఆర్థిక ప్రగతిలో బ్యాంకర్ల సహకారం అవసరమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో అన్ని బ్యాంకుల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. బ్యాంకులకు నిర్దేశించిన రుణ లక్ష్యాలు, ప్రగతిపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ 'ఇటీవల సంభవించిన వరదలను ప్రకృతి వైపరీత్యంగా ప్రకటించాం. తుఫాన్ల ప్రభావంతో వంశధార, నాగావళి నదులు పొంగినా ఎటువంటి నష్టం జరగకపోవడం శుభపరిణామం. కానీ పాక్షికంగా రోడ్లు, భవనాలు, కెనాల్స్ దెబ్బతిన్నాయి. జిల్లాలో 55 గృహాలు దెబ్బతిన్నట్లు నివేదికలు వచ్చాయి. వాటిని పరిశీలించాల్సి ఉంద'న్నారు. జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్ మాట్లాడుతూ కౌలు రైతులకు రుణాల మంజూరు విధానంపై వారం రోజుల పాటు అవగాహన సదస్సు ఏర్పాటు చేయాలని కోరారు. ఎల్డీఎం ఎం.సూర్యకిరణ్ మాట్లాడుతూ వలస రైతులు సహాయార్థం వ్యవసాయశాఖ అధికారులు బ్యాంకులను సంప్రదించాలని, వారికి బ్యాంకర్లు శతశాతం సహాయ సహకారం అందించాలని కోరారు. యూనియన్ బ్యాంకు ఆర్‌హెచ్ వెంకట్ తిలక్ మాట్లాడుతూ రైతులకు బ్యాంకుల ద్వారా సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో నాబార్డు డీడీఎం రమేష్‌కృష్ణ, డీఆర్వో ఎం.అప్పారావు, డీఆర్డీఏ పీడీ కిరణ్ కుమార్, ఉద్యానవన అధికారి ఆర్‌వి.ప్రసాద్, పరిశ్రమల జీఎం ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పరిశ్రమల తనిఖీకి కమిటీ ఏర్పాటు

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 11: జిల్లాలో వివిధ పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు, క్షుణ్ణంగా తనిఖీలు చేసేందుకు జిల్లాస్థాయి తనిఖీ కమిటీని కలెక్టర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఏర్పాటు చేశారని జిల్లా కర్మాగారాల ఉప ముఖ్య తనిఖీ అధికారి బి.రాంబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కమిటీలో శ్రీకాకుళం డీఎస్పీ, పర్యావరణశాఖ ఇంజనీర్, జిల్లా అగ్నిమాపక అధికారి, డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్(విజయనగరం), ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్(విశాఖపట్నం), డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్.. సభ్యులుగా ఉంటారు. పరిశ్రమల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్.. సెక్రటరీగా వ్యవహరిస్తారు. వీరు జిల్లాలోని అపిటోరియా ఫార్మా, ఆంధ్రా ఆర్గానిక్స్, మహాధన్ అగ్రిటెక్, ఎన్‌ఏసీఎల్, డాక్టర్ రెడ్డీస్ తదితర పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహిస్తారు. తనిఖీ నివేదికను 30 రోజుల్లోగా సమర్పిస్తారు' అని రాంబాబు తెలిపారు.

ఈ-పంట.. రీ సర్వే తంటా!

- కానరాని ఎల్‌పీ నెంబర్లు
- వ్యవసాయ, రెవెన్యూశాఖల మధ్య సమన్వయలోపం
- సమస్య పరిష్కరించని వీఆర్వోలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



మెళియాపుట్టిలో ఈ-క్రాప్ నమోదు

● మెళియాపుట్టి మండలం జలగలింగుపురానికి చెందిన నడిమిండి సోమేశ్వరావుకు 70 సెంట్ల భూమి పట్టా ఉంది. భూమి సాగు చేస్తున్నా.. మదుల సంఖ్య (ఎల్‌పీ నెంబర్) కనిపించక ఈ-క్రాప్ నమోదు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ-క్రాప్ నమోదుకు గడువు సమీపిస్తోందని.. అధికారుల చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు.

● మెళియాపుట్టి మండల పరశురాంపురం పంచాయతీ బెల్లిపాడు గ్రామానికి చెందిన పాలక దాలమ్మదీ ఇదే సమస్య. ఎల్‌పీ నెంబర్ లేక ఈ క్రాప్ నమోదు కావడం లేదు.

(మెళియాపుట్టి)

జిల్లాలో ఈ-క్రాప్ (పంట) నమోదు ప్రక్రియ సక్రమంగా సాగడం లేదు. ప్రకృతి విపత్తుల సమయంలో పంటలు దెబ్బతినే రైతులను ఆదుకునేందుకుగానూ ప్రభుత్వం ఈ-క్రాప్ నమోదు ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ నెల 15లోగా నమోదు పూర్తిచేయాలని లక్ష్యం విధించగా.. గడువులోగా ప్రక్రియ పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. వ్యవసాయ, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయ లోపం రైతులకు శాపంగా మారింది. గ్రామ రెవెన్యూ అధికారుల అలసత్వంతో కొందరు రైతులు పథకాలకు దూరమయ్యే పరిస్థితి కనిపిస్తుంది. వైసీపీ పాలనలో భూముల రీసర్వే పూర్తయిన గ్రామాల్లో నలుగురు, ఐదుగురు రైతులకు కలిపి ఒకే ఎల్‌పీ నెంబర్(మదుల సంఖ్య) కేటాయించారు. కాగా కొన్ని గ్రామాల్లో ఎల్‌పీ నెంబరు కనిపించకపోవడంతో పంట నమోదు కావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. లాగిన్ ద్వారా సమస్య పరిష్కరించేందుకు వీలున్నా వీఆర్వోలు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇటీవల సాధారణ బదిలీలు జరగనుండడంతో తమకెందుకులే అన్న చందంగా వీఆర్వోలు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి

జిల్లాలో ఈ ఏడాది 3.41లక్షల ఎకరాల్లో 2,36,791 మంది రైతులు వరి సాగు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. జాయింట్ ఎల్‌పీ నెంబరు 59,153 ఉండగా, ఖాతా నెంబర్లు 1,64,143 ఉన్నాయి. రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు కలిసి సర్వే చేసి.. 1,11369 మంది రైతుల ఈ-క్రాప్ నమోదు చేశారు. ఇంకా 52,774 మంది ఎల్‌పీ నెంబర్లు సక్రమంగా లేక ఈ-క్రాప్ నమోదుకాని పరిస్థితి నెలకొంది. వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయలోపంతో ఈ సమస్య పరిష్కారానికి చొరవ చూపడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల ప్రకారం రైతుసేవా కేంద్రంలో రైతుల ఆధార్, ఫోన్ నెంబర్‌తోపాటు పంట రకం, విస్తీర్ణం, సర్వే నెంబర్, పాస్‌పుస్తకం వివరాలను సమర్పించాలి. దీనిద్వారా భూమి జియో ఫెన్సింగ్ అవుతుంది. వ్యవసాయ అధికారులు పంట వద్దకు వెళ్లి ఫొటో తీసి ఈ-పంట నమోదు చేస్తారు. వెంటనే రైతుల ఫోన్‌కు సంక్షిప్త సమాచారం వస్తుంది. దాని ఆధారంగా పంట నష్టపరిహారం వర్తిస్తుంది. ఎరువుల కొనుగోలుకు సబ్సిడీ వస్తుంది. పథకాలకు, పంట విక్రయాలకు అవకాశం ఉంటుంది. అలాగే సమస్యలు ఉన్న భూమి దగ్గరకి వీఆర్వో రికార్డు ప్రకారం ఏ రైతు పేరుతో ఉందో గుర్తించాలి. దీనికి సర్వేయర్ సర్వే నెంబర్ సరిగ్గా ఉందో లేదో చెప్పాలి. ఆ భూమిలో వేసిన పంట వద్దే సంబంధిత రైతు ఫొటోను వ్యవసాయాధికారి తీసి ఈ-క్రాప్ నమోదు చేయాలి. కానీ ఈ విధానం ఎక్కడా సక్రమంగా సాగడం లేదనే విమర్శలు ఉన్నాయి. వీఆర్వోలు భూముల వద్దకు వెళ్లకుండానే రోడ్లపై ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో తప్పుడు జాబితాలు నమోదైతే.. విపత్తుల సమయంలో తమకు పరిహారం అందే అవకాశం ఉండదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఆన్‌లైన్‌లో కనిపించని సర్వే నెంబర్లు

వైసీపీ పాలనలో భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జగనన్న భూ సర్వే పేరిట.. భూములు రీసర్వే చేశారు. ఇందుకోసం రూ.కోట్లు ఖర్చు పెట్టినా.. సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదు. పైగా భూములు తారుమారు చేసి కొత్త సమస్యలు పెరగడంతో రెవెన్యూ అధికారులు సైతం తలలు పట్టుకుంటున్నారు. సర్వే నెంబర్ల స్థానంలో కొత్త ఎల్‌పీ నెంబర్లు కేటాయించారు. ప్రతీ గ్రామంలో వందల మందికి జాయింట్ ఎల్‌పీ నెంబర్లతో భూహక్కు పత్రాలు అందజేశారు. ఆన్‌లైన్‌లో జాయింట్ ఎల్‌పీ నెంబర్లు, ప్రత్యేక ఎల్‌పీ నెంబర్లలోని రైతుల వివరాలు కనిపించం లేదు. ప్రత్యేక ఎల్‌పీ నెంబర్లు కేటాయించినా.. వాటిలోనూ ఒకటి రెండు ఎల్‌పీ నెంబర్లు మాత్రమే చూపిస్తున్నారు. మిగతావి చూపించడం లేదు. కొందరు రైతులకు నాన్ ఫౌండ్ అని చూపిస్తోంది. కొంతమంది రైతుల భూమి విస్తీర్ణం తక్కువగా చూపిస్తున్నాట్లు చెబుతున్నారు. ఇలాంటి సమస్యలు పరిష్కరించే అవకాశం వీఆర్వోలకు ఉన్నా.. వారు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. మరోవైపు ఈ-క్రాప్ నమోదుకు గడువు సమీపిస్తోందని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి.. సమస్యలు పరిష్కరించి సక్రమంగా ఈ- క్రాప్ నమోదు పూర్తిచేయాలని కోరుతున్నారు.

టెక్కలి వైసీపీ ఇన్‌చార్జి పదవి.. మేము వేసిన భిక్ష

- దువ్వాడ శ్రీను రాష్ట్రానికి రాజు, కింగ్ మేకర్
- దివ్వల మాధురి వివాదస్పద వాఖ్యలు



మాధురి

టెక్కలి, సెప్టెంబరు 11: 'టెక్కలి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి పదవి అవతలి వ్యక్తికి దువ్వాడ వేసిన భిక్ష. అతను ముష్టి వేస్తే.. ఎవరో అవతలి వ్యక్తికి ఇన్‌చార్జి పదవి వచ్చింది. అంతేకానీ దువ్వాడ శ్రీనివాస్‌ను తలదన్నుకుని వైసీపీలో ఇన్‌చార్జిగా, ఎమ్మెల్యేగా తీసుకునే దమ్ము ఎవరికీ లేదు. ఎందుకంటే టెక్కలి అంటే దువ్వాడ శ్రీను.. దువ్వాడ శ్రీను అంటే టెక్కలి. ఇది అందరికీ తెలుసు' అని దివ్వల మాధురి వివాదస్పద వాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. వైసీపీ నేత, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, ఆయన భార్య వాణి కుటుంబ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న దివ్వల మాధురి మధ్య ఫ్యామిలీ డ్రామా నెలరోజులు దాటినా రోజుకో మలుపు తిరుగుతూనే ఉంది. బుధవారం 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'తో మాధురి మాట్లాడుతూ.. పలు ప్రశ్నలకు ఆమె బదులిచ్చిన సమాధానం.. వైసీపీలో చర్చనీయాంశంగా మారింది. మాధురి తన మాటల్లో దువ్వాడను ఇన్‌చార్జిగా ఒకరు తీసేయడం ఏమిటండి అని ప్రశ్నించడం విశేషం. 'శ్రీనును మళ్లీ టెక్కలి ఎమ్మెల్యేగా.. పొలిటికల్‌గా నిలబెట్టుకుని మంత్రిగా చూడాలన్నదే నా కోరిక. ఇట్స్ మై డ్రీమ్. కచ్చితంగా ఆ విధంగా అడుగులు వేస్తాం. అంతేకాదు.. వైసీపీలో ఏ పదవినైనా శ్రీను తెచ్చుకోగలడు. ప్రజల్లో శ్రీనుకు ఆదరణ ఉన్నప్పుడు ఇన్‌చార్జి పదవులు, ఇవన్నీ ఏమిటండి? శ్రీను ఇండిపెండెంట్‌గా పోటీచేసినా నిలదొక్కుకోగలడు. అంత భయపడాల్సిన వ్యక్తి కాదు. అలాంటి వ్యక్తిత్వం ఉన్న మనిషి దువ్వాడ శ్రీనివాస్. ఆయన రాష్ట్రానికి రాజు, కింగ్, కింగ్‌మేకర్' అని మాధురి పేర్కొన్నారు. కాగా మాధురి వాఖ్యలను ఆ పార్టీ నాయకులు కొందరు వైసీపీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినట్టు తెలుస్తోంది.



వరద ముంపులో జగనన్న కాలనీ

శ్రీకాకుళం మండలం పెద్దగనగళ్లవానిపేటలో జగనన్న కాలనీ చెరువుని తలపిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు.. జగనన్న కాలనీలో నీరు చేరి నిల్వ ఉండిపోయింది. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. గతంలో కాసుల కక్కుర్తితో వైసీపీ నాయకులు ముంపు ప్రభావిత ప్రాంతాల్లో భూమిని రెవెన్యూ అధికారులతో అధిక ధరకు కొనిపించారు. కొద్దిపాటి వర్షం కురిసినా.. కాలనీలో నీరు చేరి చెరువులా మారిపోతోంది. దీంతో చాలామంది నిర్మాణాలు చేపట్టలేక మధ్యలోనే వదిలేశారు. సచివాలయ సిబ్బంది, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ముంపు సమస్యకు పరిష్కారం చూపడం లేదని లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. బుధవారం పెద్దగనగళ్లవానిపేటలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పర్యటించినా.. ఈ కాలనీ దుస్థితిపై దృష్టి సారించలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

- శ్రీకాకుళం రూరల్

అందరికీ రిలేట్ అవుతుంది

'బెంచ్ లైఫ్' వెబ్ సిరీస్‌తో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు మానస శర్మ. తమిళ నటుడు వైభవ్, చరన్ పెరి, రాజేంద్ర ప్రసాద్, రితికా సింగ్, అకాంక్ష సింగ్ ప్రధాన పాత్రలు పోషించారు. నిహారిక కొణిదెల నిర్మించారు. ఈ శుక్రవారం ఓటీటీ సంస్థ 'సోనీ లైవ్'లో విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది.



నిర్మాత నిహారిక కొణిదెల మాట్లాడుతూ "ఇది కార్పోరేట్ ఉద్యోగుల కథ అయినా.. అందరికీ రిలేట్ అవుతుంది. వినోదంతో పాటు.. మంచి భావోద్వేగాలు ఇందులో ఉంటాయి. అద్భుతమైన కంటెంట్ ఉన్న ఈ వెబ్ సిరీస్ తప్పకుండా అందరికీ నచ్చుతుంది" అని చెప్పారు. దర్శకురాలు మానస శర్మ మాట్లాడుతూ "నేను జాబ్ చేస్తున్నప్పుడు ఎదురైన అనుభవాలు.. లైఫ్‌లో చూసిన అనేక సంఘటనలను స్ఫూర్తిగా తీసుకొని తెరకెక్కించిన వెబ్ సిరీస్ ఇది. ప్రతీ పాత్రకూ ఓ కథ ఉంటుంది. ఇందులోని నటీనటులు పంచే వినోదం చాలా కాలం గుర్తుంటుంది" అని చెప్పారు. నటుడు చరణ్ పెరి మాట్లాడుతూ "స్నేహ మాధుర్యాన్ని.. అభిరుచులను సరికొత్తగా ఆవిష్కరించే సిరీస్ ఇది" అని అన్నారు.

విడాకుల విషయం నాకు తెలియదు


ఆర్తి రవి

తనకు తెలియకుండా, తన సమ్మతి లేకుండా తన భర్త విడాకుల ప్రకటన చేశారంటూ ఆర్తి రవి బుధవారం ప్రకటన విడుదల చేయడంతో తమిళ హీరో జయం రవి విడాకుల వ్యవహారం సరికొత్త మలుపు తిరిగింది. ఈ విషయంపై ఆమె విడుదల చేసిన ప్రకటనలో.. 'మా వైవాహిక జీవితం గురించి మీడియా, సోషల్ మీడియాలో వస్తున్న కథనాలు చూసి ఆందోళనకు గురయ్యాను. 18 ఏళ్ళుగా పరస్పర విశ్వాసం, గౌరవంతో కుటుంబ జీవితాన్ని గడుపుతున్నాం. ఈ విడాకుల ప్రకటన వల్ల మా గౌరవ మర్యాదలతో పాటు వ్యక్తిత్వాన్ని కోల్పోయినట్టుగా భావిస్తున్నాను. నా భర్తతో మాట్లాడాలని, కలవాలని ఎన్నో సార్లు ప్రయత్నం చేశాను. కానీ, నాకు అలాంటి అవకాశం దక్కలేదు. నేను, నా పిల్లలు ఇబ్బంది పడుతున్నాం. వైవాహిక బంధం నుంచి వైదొలగాలనే ఈ నిర్ణయం పూర్తిగా ఆయన సొంతంగా తీసుకున్నది. దీనిపై బహిరంగంగా వ్యాఖ్యానించదలచుకోలేదు. అయితే, నా వ్యక్తిత్వానికి కళంకం కలిగించేలా బహిరంగంగా జరుగుతున్న ప్రచార దాడులను సహించలేకపోతున్నాను. ఈ అసత్య ప్రచారాన్ని తిరస్కరించడం నా తొలి కర్తవ్యం' అని ఆర్తి రవి పేర్కొన్నారు.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)



భారీ వర్షాలు, వరదలతో ఇబ్బంది పడుతున్న ప్రజలను ఆదుకోవడానికి రెండు తెలుగు రాష్ట్రాల సీఎం రిలీఫ్ ఫండ్‌కు కలిపి హీరో సాయిదుర్గ తేజ్ రూ. 20 లక్షలు విరాళం ప్రకటించిన సంగతి తెలిసిందే. బుధవారం ఏపీ మంత్రి నారా లోకేశ్‌కు రూ. పది లక్షల చెక్కును విజయవాడలో అందించారు సాయి దుర్గ తేజ్. అలాగే అమ్మ అనాథాశ్రమానికి రూ. రెండు లక్షలు, ఇతర సేవా సంస్థలకు రూ. మూడు లక్షలు విరాళంగా అందించారు

సాహసనారి సంయుక్త



నిఖిల్ కథానాయకుడిగా భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'స్వయంభూ'. పీరియాడిక్ వార్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో నిఖిల్‌కు జోడీగా నభానటేష్, సంయుక్త నటిస్తున్నారు. బుధవారం సంయుక్త పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం ఆమె ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. యుద్ధ భూమిలో విల్లును ఎక్కుపెడుతున్న యోధురాలిగా ఆమె లుక్ అలరించింది. భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. అలాగే శర్వానంద్ సరసన సంయుక్త హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రం (శర్వా 37-వర్కింగ్ టైటిల్) నుంచి ఆమె పాత్రను పరిచయం చేస్తూ ప్రత్యేక లుక్‌ను యూనిట్ విడుదల చేసింది. ఈ చిత్రంలో దియా అనే పాత్రలో ఆమె కనిపించనున్నారు. రామ్ అబ్బరాజు దర్శకత్వం వహిస్తున్నారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రంలోనూ సంయుక్త హీరోయిన్‌గా నటిస్తున్నారు. మహేశ్ చందు నిర్మాత. సమీరా అనే పాత్రలో సంయుక్త నటిస్తున్నారు. ఆమె పుట్టిన రోజు సందర్భంగా యూనిట్ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది.

మలైకా ఇంట విషాదం



బాలీవుడ్ నటి మలైకా అరోరా ఇంట్లో విషాద ఘటన జరిగింది. మలైకా సవతి తండ్రి అనిల్ మెహతా ముంబైలో ఆరు అంతస్థుల భవంతి నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని.. ఆయనను ఆస్పత్రిలో చేర్పించారు. కానీ అప్పటికే ఆయన చనిపోయారని వైద్యులు తెలిపారు. అయితే అనిల్ మెహతాది ఆత్మహత్య కాదా అనే విషయం అధికారికంగా తెలియాల్సి ఉంది.

ఉన్నత విద్యలో ఇక ఒకే విధానం

» అన్ని యూనివర్సిటీలు, కాలేజీలకు వర్తింపు

» 2024-25 అకడమిక్ క్యాలెండర్ విడుదల

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యలో ఏకరూప విధానాన్ని అమలు చేసేందుకు ఉన్నత విద్యాశాఖ చర్యలు ప్రారంభించింది. డిగ్రీ, బీటెక్, ఫార్మసీ కోర్సులకు ఉన్నత విద్యాశాఖ 2024-25 అకడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. ఏటా అకడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేస్తున్నా యూనివర్సిటీలు దాన్ని అమలుచేయడం లేదు. ఒక్కో యూనివర్సిటీ ఒక్కోలా పరీక్షలు నిర్వహించుకుంటున్నాయి. ఇకపై అన్ని వర్సిటీలు ఒకే విధానాన్ని అమలుచేయాలని ప్రభుత్వం స్పష్టంచేసింది. అకడమిక్ క్యాలెండర్ ప్రకారమే బోధన, పరీక్షలు నిర్వహించాలని ఆదేశించింది.

డిగ్రీ కోర్సులకు ఇలా..

అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సాధారణ డిగ్రీ కోర్సుల సెమిస్టర్-1 తరగతులు ఆగస్టు 12న ప్రారంభమవుతాయి. డిసెంబరు 9 నుంచి 21 వరకు పరీక్షలు జరుగుతాయి. జనవరి 10న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-2 డిసెంబరు 23న ప్రారంభమవుతుంది. ఏప్రిల్ 21 నుంచి మే 3 వరకు పరీక్షలు జరుగుతాయి. మే, జూన్ నెలల్లో ఎనిమిది వారాల కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టు ఉంటుంది. మే 24న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-3 జూలై 8న ప్రారంభమవుతుంది. నవంబరు 11 నుంచి 23 వరకు పరీక్షలు జరుగుతాయి. డిసెంబరు 13న ఫలితాలు ప్రకటిస్తారు. సెమిస్టర్-4 నవంబరు 25న ప్రారంభవుతుంది. ఏప్రిల్ 21 నుంచి జూన్ 14 వరకు పరీక్షలు జరుగుతాయి. ఏప్రిల్, జూన్ నెలల్లో ఎనిమిది వారాల షార్ట్ టర్మ్ ఇంటర్న్‌షిప్ ఉంటుంది. సెమిస్టర్-5 జూలై 8న ప్రారంభమవుతుంది. నవంబరు 11 నుంచి 23 వరకు పరీక్షలు జరుగుతాయి. డిసెంబరు 13న ఫలితాలు ప్రకటిస్తారు. సెమిస్టర్-6 నవంబరు 25న ప్రారంభమవుతుంది. మార్చి 24 నుంచి ఏప్రిల్ 5 వరకు పరీక్షలు జరుగుతాయి. ఏప్రిల్ 26న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-7 జూలై 1న ప్రారంభమవుతుంది. నవంబరు 4 నుంచి 16 వరకు పరీక్షలు జరుగుతాయి. డిసెంబరు 7న ఫలితాలు ప్రకటిస్తారు. సెమిస్టర్-8 నవంబరు 18న ప్రారంభమవుతుంది. మార్చి 24 నుంచి ఏప్రిల్ 5 వరకు పరీక్షలు జరుగుతాయి. ఏప్రిల్ 26న ఫలితాలు విడుదల చేస్తారు.

బీటెక్‌కు ఇలా..

ఇంజనీరింగ్ సెమిస్టర్-1 తరగతులు ఆగస్టు 1న ప్రారంభమవుతాయి. డిసెంబరు 16 నుంచి జనవరి 4 వరకు పరీక్షలు జరుగుతాయి. జనవరి 25న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-2 జనవరి 6న ప్రారంభమవుతుంది. జూన్ 2 నుంచి 21 వరకు పరీక్షలు జరుగుతాయి. జూలై 11న ఫలితాలు ప్రకటిస్తారు. సెమిస్టర్-3 జూలై 8న ప్రారంభమవుతుంది. నవంబరు 11 నుంచి 30 వరకు పరీక్షలు జరుగుతాయి. డిసెంబరు 21న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-4 డిసెంబరు 2న ప్రారంభమవుతుంది. ఏప్రిల్ 7 నుంచి 26 వరకు పరీక్షలు జరుగుతాయి. మే 17న ఫలితాలు ప్రకటిస్తారు. ఏప్రిల్, జూన్ నెలల్లో 8 వారాల కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టు ఉంటుంది. సెమిస్టర్-5 జూలై 8న ప్రారంభమవుతుంది. నవంబరు 11 నుంచి 30 వరకు పరీక్షలు జరుగుతాయి. డిసెంబరు 21న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-6 డిసెంబర్ 2న ప్రారంభమవుతుంది. ఏప్రిల్ 7 నుంచి 26 వరకు పరీక్షలు జరుగుతాయి. 8వారాల షార్ట్ టర్మ్ ఇన్‌టర్న్‌షిప్ ఉంటుంది. మే 17న ఫలితాలు ప్రకటిస్తారు. సెమిస్టర్-7 జూలై 29న ప్రారంభమై... నవంబరు 25 నుంచి డిసెంబరు 14 వరకు పరీక్షలుంటాయి. జనవరి 4న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-8 డిసెంబరు 16న ప్రారంభమై.. ఏప్రిల్ 15 నుంచి 19 వరకు పరీక్షలు జరుగుతాయి. ఏప్రిల్ 26న ఫలితాలు ప్రకటిస్తారు.

డిగ్రీ అడ్మిషన్ల షెడ్యూల్ మార్పు

మూడో విడత డిగ్రీ అడ్మిషన్లకు ఇటీవల విడుదల చేసిన షెడ్యూల్‌ను ఉన్నత విద్యామండలి సవరించింది. రిజిస్ట్రేషన్ గడువును ఈనెల 15వ తేదీ వరకు పొడిగించింది. 11 నుంచి 18 వరకు విద్యార్థులు ఆప్షన్లు ఎంపిక చేసుకోవచ్చని, 19న ఆప్షన్ల మార్పునకు అవకాశం ఉంటుందని తెలిపింది. 22న సీట్ల కేటాయింపు జరుగుతుందని, 22 నుంచి 25లోగా విద్యార్థులు కాలేజీల్లో రిపోర్టు చేయాలని పేర్కొంది.

జెత్వానీ మొబైల్ ఫోన్ ఎక్కడ?

» వివరాలు తమ ముందుంచాలని పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సినీనటి కాదంబరి జెత్వానీ నుంచి సీజ్ చేసిన మొబైల్ ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలు ప్రస్తుతం ఎక్కడ ఉన్నాయో చెప్పాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. వాటిని భద్రపరిచేందుకు తీసుకున్న చర్యలను తెలపాలని కోరింది. ఎలక్ట్రానిక్ పరికరాలను భద్రపరచాలని పోలీసులను ఆదేశిస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది. విద్యాసాగర్ దాఖలు చేసిన వ్యాజ్యంలో ప్రతివాదిగా చేర్చుకొని తన వాదనలు వినిపించేందుకు అనుమతించాలంటూ కాదంబరి దాఖలు చేసిన ఇంప్లీడ్ పిటిషన్‌ను హైకోర్టు అనుమతించింది. విచారణను ఈ నెల 17కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. జెత్వానీ నుంచి పోలీసులు సీజ్ చేసిన పరికరాలను నిందితురాలికి వెనక్కి ఇవ్వకుండా ఆదేశించాలని కోరుతూ ఉమ్మడి కృష్ణాజిల్లా, కోసూరుకు చెందిన కేవీఆర్ విద్యాసాగర్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం మరోసారి విచారణకు రాగా పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది టి.నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. జెత్వానీ తరఫు న్యాయవాది నర్రా శ్రీనివాస్.. వ్యాజ్యంలో ఇంప్లీడ్ అయి వాదనలు వినిపించేందుకు అనమతించాలని కోరారు.

రహదారుల భద్రతపై హైకోర్టులో పిల్

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రహదారుల భద్రత, నిర్వహణ విషయంలో సుప్రీంకోర్టు కమిటీ ఇచ్చిన మార్గదర్శకాలను రాష్ట్రంలో అమలు చేయట్లేదంటూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యం(పిల్)పై హైకోర్టు స్పందించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులుగా ఉన్న కేంద్ర రవాణాశాఖ కార్యదర్శి, ఏపీ ప్రభుత్వ సీఎస్, రవాణాశాఖ కార్యదర్శి, పురపాలకశాఖ ప్రత్యేకప్రధాన కార్యదర్శి, రహదారుల అభివృద్ధి సంస్థ చీఫ్ ఇంజనీర్, రవాణాశాఖ కమిషనర్, డీజీపీ తదితరులకు నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది.

వరద బాధితులకు ఆపన్నహస్తం

కోటి ఇచ్చిన డిక్సన్, జీవీపీఆర్ ఇంజనీర్స్, నెక్కంటి సీ ఫుడ్స్, సంధ్య ఆక్వా

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వరద బాధితుల సహాయార్థం దాతలు స్పందించి, ముఖ్యమంత్రి సహాయ నిధికి తమవంతు విరాళాలు అందజేస్తున్నారు. బుధవారం సాయంత్రం అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలసి పలువురు విరాళాల చెక్కులు అందజేశారు. సంధ్యా మెరైన్స్ కేవీ ప్రసాద్ రూ.కోటి, జీవీపీఆర్ ఇంజనీర్స్ లిమిటెడ్ ఛైర్మన్ జీఎస్‌పీ వీరారెడ్డి, ఎండీ శేఖర్‌రెడ్డి రూ.కోటి, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఛైర్మన్ సత్యప్రకాష్‌సింగ్ రూ.86 లక్షలు, వైశాఖి ఫౌండేషన్ ఎల్లంకి రవికుమార్ రూ.50 లక్షలు, దర్శి నియోజకవర్గ ప్రజల తరఫున రూ.37,16,200, మోడల్ డైరీ ఎండీ పీ ధనప్రకాష్ రూ.30 లక్షలు, నార్త్ అమెరికా కమ్మ సంఘం రూ.30 లక్షలు, దర్శి నియోజకవర్గ టీడీపీ మహిళా నేత గొట్టిపాటి లక్ష్మీ రూ.10 లక్షలు, మణిపాల్ హాస్పటల్స్ క్లస్టర్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి, అసోసియేట్ డైరెక్టర్ జే రామాంజనేయరెడ్డి రూ.25 లక్షలు, ఆఫ్రికా, కెన్యా టీడీపీ తరఫున బొబ్బా శివప్రకాష్ రూ.20 లక్షలు, ది సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ రాజు, ఎండీ కేవీ సుబ్బయ్య రూ.10 లక్షలు, గుంటూరు డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు రూ.1,84,500 సీఎంకు అందజేశారు. కాగా, అమరావతి సచివాలయంలో.. డిక్సన్ గ్రూప్ కంపెనీ ప్రతినిధులు రూ.కోటి, నెక్కంటి సీ ఫుడ్స్ యాజమాన్యం రూ.కోటి, సంధ్య ఆక్వా రూ.కోటి చెక్కును మంత్రి లోకేశ్‌ని కలసి అందజేశారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రూ.25 లక్షలు, రేస్ పవర్ సంజయ్‌గుప్తా రూ.25 లక్షలు, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కర్నూలుకు చెందిన డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి రూ.11 లక్షలు, సినీ హీరో సాయి ధరమ్ తేజ్ రూ.10 లక్షలు అందజేశారు. కాగా, మంత్రి టీజీ భరత్ విజయవాడలోని ఊర్మిళా నగర్‌లో వరద బాధితులకు నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు.

ఎస్‌డబ్ల్యూపీసీ నిర్మాణాలు వేగవంతం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

కోటబొమ్మాళి: మండలంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఎంపీడీవో కె.ఫణీంద్ర కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సాంకేతిక క్షేత్ర సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుప్పలపాడు, మాసాహెబ్‌పేట, కన్నెవలస, యలమంచిలి, గంగరాం, వాంగ్రాడ, జర్జంగి, కొత్తపేట పంచాయతీల్లో వీటి నిర్మాణాన్ని వేగవంతం చేయాలని అన్నారు. వేతనదారులకు ప్రతి గ్రామ పంచాయతీలో పనులు కల్పించి వంద రోజులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ శైలజ, ఏపీవో జి.హరిప్రసాద్, ఈసీ టి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్ ఏర్పాటుకు గ్రామసభ


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రంగయ్య

నరసన్నపేట: ఉప్పరిపేట గ్రామంలో ఇసుక రీచ్ ఏర్పాటు చేసేందుకు బుధవారం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. శ్రీకాకుళం ఆర్డీవో రంగయ్య మాట్లాడుతూ గ్రామ ప్రజల అనుమతులతో ప్రభుత్వం ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేస్తుందన్నారు. ఉప్పరిపేట సర్వే నెంబరు 1లో వంశధార నదిలో 2.30 హెక్టార్లలో ఏడాదికి 23వేల క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వకాలు చేపట్టనున్నట్టు వివరించారు. ఈ కార్యాక్రమంలో పర్యావరణ బోర్డు ఇంజనీరింగ్ అధికారి రామారావు నాయుడు, తహసీల్దార్ సత్యనారాయణ, గనుల శాఖ అధికారులు పాల్గొన్నారు. కొత్తవీధి వినాయకుడిని ఆర్డీవో రంగయ్య దర్శించుకున్నారు.

రామ్మోహన్‌నాయుడుకు పదవిపై హర్షం

కోటబొమ్మాళి: కేంద్ర విమానయాన శాఖ మంత్రి, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆసియా, పసిఫిక్ మినిస్టీరియల్ కాన్ఫరెన్స్ చైర్మన్‌గా ఎన్నికవ్వటం పట్ల స్థానిక తెలుగుదేశం నేతలు కింజరాపు హరివరప్రసాద్, బోయిన గోవిందరాజులు, బోయిన రమేష్, కర్రి అప్పారావు, తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, నంబాల శ్రీనివాసరావు, నంబాళ రాజశేఖర్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఇది శ్రీకాకుళం జిల్లా ప్రజలకు గర్వకారణమని వారు కొనియాడారు.

నాటుసారాతో కుటుంబాలు నాశనం


మాట్లాడుతున్న సీఐ జైభీమ్

హరిపురం: నాటుసారా తాగితే అనారోగ్యంతో ఆర్థికంగా చితికిపోయి కుటుంబాలు నాశనమవుతాయని ఎక్సైజ్ సీఐ జైభీమ్ అన్నారు. కొత్తపల్లి పంచాయితీ ముకుందపురం గ్రామంలో మంగళవారం గ్రామస్థులతో అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా తాగితే కలిగే అనర్థాలను వివరించారు. మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, గ్రామస్థులు, యువత పాల్గొన్నారు.

వరద బాధితులకు చిన్నారుల ఆర్థిక సాయం

సంతబొమ్మాళి: విజయవాడ వరద బాధితులకు మండలంలోని నౌపడ సత్యసాయి విద్యానికేతన్ విద్యార్థులు బుధవారం రూ.పదివేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ మొత్తాని సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేస్తామని కరస్పాండెంట్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు.

మెళియాపుట్టి: విజయవాడ వరద బాధితుల కోసం బుధవారం నలంద పబ్లిక్ స్కూల్ విద్యార్థులు విరాళాలు సేకరించారు. మెళియాపుట్టి రాజవీధి నుంచి మూడు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రతాప్, మురళి, జి.ధర్మారావు, శారద తదితరులు పాల్గొన్నారు.

15లోగా పంట నమోదు చేసుకోవాలి

మెళియాపుట్టి: ఈనెల 15వ తేదీలోగా ఖరీఫ్‌నకు సంబంధించి పంట నమోదు కార్యక్రమం చేసుకోవాలని ఏవో దానకర్నుడు తెలిపారు. దీని వల్ల ప్రభుత్వ సాయం అందే అవకాశం ఉంటుందన్నారు. ధాన్యం అమ్మకాల సమయంలో ఈక్రాప్ కచ్చితంగా ఉండాలని స్పష్టం చేశారు.

స్వచ్ఛత కార్యక్రమాలను విజయవంతం చేయాలి

నందిగాం: మండలంలో ఈనెల 15 నుంచి అక్టోబరు 2 వరకు నిర్వహించనున్న స్వచ్ఛతహీ సేవా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎంపీడీవో టి.రాజారావు సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీల వారీగా పొందుపరిచిన అంశాలను చేపట్టి ఆదర్శ మండలంగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మండల కో-ఆర్డినేటర్ ఎ.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మెళియాపుట్టి: ఇటీవల కురిసిన వర్షాలకు ఇంటి గోడ కూలిపోయి నిరాశ్రయుడైన గంగరాజపురం గ్రామానికి చెందిన అర్జున్‌బిస్వాల్ కుటుంబానికి టీడీపీ నాయకులు బుధవారం బియ్యం, ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు అనపాన రాజశేఖర్‌రెడ్డి, యువజన సంఘ నాయకులు బి.పరమేష్‌రెడ్డి, శేఖర్, బమ్మిడి భాస్కరావు, చక్రి తదితరులు పాల్గొన్నారు.

నీటి నమూనా పరీక్షలపై ఆరా

టెక్కలి: తిర్లంగి గ్రామంలో ఎంపీడీవో చింతాడ లక్ష్మీబాయి నీటి నమూనా పరీక్షలపై ఆరా తీశారు. సీజనల్ వ్యాధులు, విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో నీటి నమూనా పరీక్షలు అవసరమని ఆమె తెలిపారు. ఆమెతో పాటు ఈవోపీఆర్డీ మల్లేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మోహన్, ఈవో జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

అడవి పందుల నుంచి కాపాడండి

పలాస రూరల్: కంబిరిగాం, సొగిడియ, కేదారిపురం, గంగువాడ గ్రామాలతో పాటు కొత్తపారసాంబ, జగన్నాథ సాగర ఆయకట్టు ప్రాంతాల్లోని పొలాల్లో అడవి పందులు పంటలను నాశనం చేస్తున్నాయి. పొలం గట్లను ధ్వంసం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళల్లో ఇవి వస్తుండడంతో ఎవరూ ఏమీ చేయలేని దుస్థితి నెలకొందని అంటున్నారు. అటవీ శాఖాధికారులు స్పందించి అడవి పందుల బెడద నుంచి తప్పించాలని రైతులు కోరుతున్నారు.

ఎన్టీఆర్ గృహాల పరిశీలన

నరసన్నపేట: కోమర్తి గ్రామంలో హౌసింగ్ బిల్లుల పెండింగ్‌పై సంబంధిత అధికారులు బుధవారం ఆరా తీశారు. ఎన్టీఆర్ గృహకల్పన పథకంలో చేపట్టిన ఇళ్లను పరిశీలించారు. 2014-19 మధ్య కాలంలో నిర్మించిన ఇళ్లకు బిల్లులు చెల్లించలేదు. దీంతో అధికారంలోకి వచ్చిన తరువాత కూటమి ప్రభుత్వం సంబంధిత గృహాలను పరిశీలించాలని ఆదేశించింది. ఈ మేరకు నిర్మాణాలను అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శిమ్మ జగన్నాథం, ఇంజనీరింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జలుమూరు: చల్లవానిపేట విద్యుత్ సబ్‌స్టేషను పరిధిలో గల 11 కేవీ తిలారు ఫీడర్‌లో గల గ్రామాలకు ఈనెల 13న శుక్రవారం విద్యుత్ సరపరా నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. టెక్కలిపాడు, రావిపాడు, రావాడపేట, హరికృష్ణంపేట, సొడాం, దరివాడ, లింగాలవలస తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

టెక్కలి: రావివలస సబ్‌స్టేషన్, హెడ్‌క్వార్టర్ ఫీడర్ వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సేవలకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రావివలస, శ్యామసుందరాపురం, ఐతమ్ కళాశాలల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు వెల్లడించారు.

పారిశుధ్యాన్ని మెరుగుపరచండి


సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పలాస రూరల్ : గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన పారిశుధ్యం ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో ఎన్.రమేష్‌నాయుడు ఆదేశించారు. గంగువాడ, చినంచల గ్రామాల్లో ఆయన బుధవారం పర్యటించి పారిశుధ్యం తీరును పరిశీలించారు. గ్రామంలో ఉండే చెత్తను ఎప్పటికప్పుడు ఎత్తివేయాలని, నీరు నిల్వ ఉండకుండా చూడాలని, బ్లీచింగ్ చేయాలని ఆదేశించారు. ఆయనతో పాటు ఈఓపీఆర్డీ మెట్ట వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

చెరువు స్థలంలో అక్రమ నిర్మాణాలు

- అడ్డుకున్న రెవెన్యూ అధికారులు


అక్రమ నిర్మాణాలు తొలగిస్తున్న సిబ్బంది

మెళియాపుట్టి: స్థానిక మూడు రోడ్ల కూడలిలో ఉన్న కొత్త చెరువులో అక్రమ నిర్మాణాలు జరుగుతుండడంతో రెవెన్యూ అధికారులు బుధవారం అడ్డుకున్నారు. ఇక్కడ అడుగు రూ.రెండు లక్షలకు పైగా పలుకుతోంది. దీంతో ఖాళీ జాగా కనిపిస్తే చాలు..అక్రమార్కులు పాగా వేసేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు అక్రమణ నిర్మాణాలను అడ్డుకొనే పరిస్థితులు లేకపోవటంతో ఆక్రమణదారులు చెలరేగిపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కూడ అదే ధోరణి కొనసాగిస్తున్నారు. ఆక్రమణదారుల్లో కొంతమంది వైసీపీ నుంచి టీడీపీలో చేరిపోయి తమ పని కానిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు అడ్డుకోకపోవడంతో వీరు ఆడిందే ఆటగా మారిపోయింది. ఈ క్రమంలోనే బుధవారం రూ.20 లక్షల విలువైన స్థలంలో నిర్మాణాలకు కొందరు సిద్ధపడడంతో వీఆర్‌వో కోటేశ్వరావు వెళ్లి పరిశీలించారు. సర్వే నెంబర్ 348 చెరువు పోరంపోగుగా రికార్డుల్లో ఉన్నట్టు గుర్తించినట్లు తెలిపారు. నిర్మాణాలకు సిద్ధమైన వారు ఒక డీ పట్టా చూపించారని, అది నకిలీదిగా గుర్తించినట్లు తెలిపారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని వివరించారు. అంతవరకు పనులు నిలుపుదల చేయలని ఆదేశించినట్లు చెప్పారు. చెరువు గర్భాన్ని మరికొంతమంది ఆక్రమించినట్లు గుర్తించామని, వీటిని తొలగిస్తామని తెలిపారు.

వర్గీకరణ తీర్పుపై నిరసన


టెక్కలిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

టెక్కలి: ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్లపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు అన్యాయమని దళిత సంఘాల నాయకులు బోకర నారాయణరావు, చల్లా రామారావు, కప్పిలి కామేశ్వరరావులు అన్నారు. బుధవారం ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగానికి వ్యతిరేకం గా ఉందని అన్నారు. ఈ ర్యాలీలో చింతాడ శ్రీనివాస్, సుంకు గోపీనాథ్, జడ్యాడ జయరాం, వినోద్ కుమార్, బాబూరావు, ఆట్ల రాహుల్, భీమయ్య, దమయంతి, గోపాలరావు, చిన్నవాడు, బాలకృష్ణ, దాలయ్య పాల్గొన్నారు.

కొత్తూరు: ఎస్సీ వర్గీకరణకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వెనక్కి తీసుకోవాలని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక అంబేద్కర్ కూడలిలో నల్లబ్యాడ్జీలు ధరించి బుధవారం నిరసన తెలిపారు. సమితి గౌరవాధ్యక్షుడు బొడ్డేపల్లి కృష్ణ, ప్రధాన కార్యదర్శి పడాల నాగభూషణం, జమ్మయ్య మాస్టార్, గుమ్మయ్య, వడమ శ్రీను, సింహాచలం, రామకృష్ణ పాల్గొన్నారు.

చెరువుల వేలంలో నిబంధనలు తప్పనిసరి: డీఎల్‌పీవో

కోటబొమ్మాళి: చేపల చెరువుల వేలం పాటలు నిబంధనల ప్రకారమే జరగాలని టెక్కలి డీఎల్‌పీవో ఐ.వి. రమణ స్పష్టం చేశారు. ఎత్తురాళ్లపాడు పంచాయతీ సర్పంచ్ స్థానికంగా ఉన్న చెరువును బహిరంగ వేలం వేయకుండా పాటదారుల నుంచి వసూలు చేసి... అప్పజెప్పారని స్థానికులు ఆరోపించారు. ఈ మొత్తం పంచాయతీ నిధులకు జమ కాలేదని కొంతమంది గ్రామస్థులు డీపీవోకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం ఎత్తురాళ్లపాడులో డీఎల్‌పీఓ విచారణ చేపట్టారు. బహిరంగ వేలం ద్వారా వచ్చిన నిధులు పంచాయతీ అభివృద్ధి పనులకు వినియోగించాల్సి ఉందన్నారు. విచారణ నివేదికలను ఉన్నదాధికారులను అందజేస్తానని తెలిపారు. ఆయనతో పాటు ఎంపీడీవో కె. ఫణీంద్రకుమార్, ఈవోపీఆర్డీ బి.రామారావు ఉన్నారు.

అనధికారికంగా విద్యుత్ వినియోగిస్తే చర్యలు

శ్యామలాపురం(ఎల్.ఎన్.పేట): గ్రామాల్లో అనుమతులు లేకుండా విద్యుత్‌ను వినియోగిస్తే బాధ్యులపె చర్యలు చేపడతామని ఆ శాఖ విజిలెన్స్ ఏఈలు మురళి, కృష్ణారావు తెలిపారు. శ్యామలాపురం గ్రామంలో బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో గణేశ్ మండపాలకు విద్యుత్ శాఖ అధికారుల అనుమతులను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఇటీవల రణస్థలం మండలంలో దొంగతనంగా విద్యుత్ వినియోగించిన 11మందిపై కేసులు నమోదు చేసి, అపరాధ రుసుం వసూలు చేశామని చెప్పారు. వీరితో పాటు విజిలెన్స్ కానిస్టేబుల్ గోవిందరావు పాల్గొన్నారు.

భారీ ధర పలికిన లడ్డూలు

సంతబొమ్మాళి: వినాయక నవ రాత్రుల సందర్భంగా ఏర్పాటు చేస్తున్న లడ్డూలు వేలంలో అధిక ధర పలుకుతున్నాయి. చిన్న కేశవనాయుడుపేటలో వేలంలో లడ్డూను గ్రామానికి చెందిన పనపాన ఎల్లయ్యరెడ్డి రూ.78,116కు దక్కించుకున్నాడు. కాపుగోదాయవలసలో వినాయక లడ్డూను వేలంలో నెయ్యిల నాగేశ్వరరావు రూ.57వేల కు సొంతం చేసుకున్నాడు.

నిబంధనల ప్రకారమే అనుమతి


రికార్డులు పరిశీలిస్తున్న జేసీ

చింతలబడవంజ(ఎల్.ఎన్.పేట): గామీణ ప్రాంతాలలో ప్రధాన రోడ్లకు అనుకూలంగా ఉన్న ప్రభుత్వ స్థలాల్లో నిబంధనల ప్రకారం పెట్రోల్ బంకుల ఏర్పాటుకు అనుమతులు ఇస్తామని జేసీ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్ తెలిపారు. అలికాం-బత్తిలి ప్రధాన రోడ్డు పక్కన పెట్రోల్ బంకు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట పొలాలను వ్యాపార భూములుగా మార్చుకొనే యజ మానులు అనుమతులు పొందాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే తొలగించడంతో పాటు శాఖాపరంగా చర్యలు చేపడతామని హెచ్చరించారు.

రైతులకు న్యాయం చేయాలి

చింతల బడవంజలోని చిన్నచెరువు దిగువున ఉన్న ఆయకట్టు రైతులకు న్యాయం చేయాలని సర్పంచ్ వి.లక్ష్మి, పి.సింహబలుడు, వి.సత్యనారాయణ, పి.సన్యాసిరావు, సీహెచ్. శ్రీనివాసరావు తదితరులు బుధవారం జేసీ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్‌కు వినతిపత్రాన్ని ఇచ్చారు. తమ ఆడపిల్లల వివాహాలు, అనారోగ్యాల సమయంలో భూములను అమ్ముకోలేకపోతున్నామని వినతిపత్రంలో పేర్కొన్నారు. భూముల క్రయ విక్రయాలకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సుదర్శన్‌దొర, తహసీల్దార్ వైవీ పద్మావతి, డిప్యూటీ తహసీల్దార్ రషీద్ అహమ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

జలుమూరు: జలుమూరుకు నూతనంగా మంజూరైన పెట్రోలు బంకు ఏర్పాటుకు స్థలాన్ని జేసీ ఫరూక్ అహ్మద్ ఖాన్ బుధవారం పరిశీలించారు. ఈ పరిశీలనలో డీఎస్ఓ బి.శాంతిశ్రీ, తహసీల్దారు లక్ష్మీనారాయణ, డిప్యూటీ తహసీల్దారు పి.శ్రీనివాసరావు, ఆర్.ఐ. సతీష్‌కుమార్, వీఆర్వో బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక విగ్రహాల నిమజ్జనం

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వినాయక నిమజ్జనోత్సవాలను బుధవారం ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో సామూహిక కుంకుమ పూజలు, అన్నదాన కార్యక్రమాలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వినాయకుని లడ్డూలను వేలంలో దక్కించుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. -ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్


కాశీబుగ్గ: అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గౌతు శిరీష


నందిగాం: కుంకుమ పూజల్లో మహిళలు


జలుమూరు: నిమజ్జనోత్సవంలో కోలాటం


నరసన్నపేట: 21రకాల నైవేద్యాలతో మహిళలు

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి


ఎస్‌ఈకి వినతిపత్రం ఇస్తున్న బుచ్చిబాబు

హిరమండలం: వివిధ గ్రామాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జెడ్పీటీసీ పి.బుచ్చిబాబు బుధవారం ఎస్ఈ ఎస్.కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. శ్రీకాకుళంలోని కార్యాలయంలో ఎస్ఈని కలుసుకొని వివిధ సమస్యలను జెడ్పీటీసి తెలియజేశారు. స్థానిక పెద్దకోరాడ నుంచి నౌగూడ వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా విద్యుత్ స్తంభాలు, బల్బులు వేయాలని కోరారు. లైన్‌మేన్‌లను నియమించాలని కోరారు.

జీవో 85ను రద్దు చేయండి

జలుమూరు (సారవకోట): జీవో 85ను రద్దుచేసి ఆదుకోవాలని సారవకోట వైద్యాధికారి సౌమ్య ప్రభుత్వాన్ని కోరారు. జీవో 85ని రద్దు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈమేరకు సారవకోట వైద్యాధికారులు సౌమ్య, దేవిక, సుస్మిత బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

కోటబొమ్మాళి: కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, జీవో నెంబర్ 115కి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కోటబొమ్మాళి సామాజిక ఆసుపత్రిలోని స్టాఫ్‌నర్సులు డిమాండ్ చేశారు. బుధవారం నల్లరిబ్బన్లు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువారం కూడా నిరసన కొనసాగిస్తామని తెలిపారు.

క్రీడా పోటీల నిర్వహణకు ప్రణాళిక

మబగాం (పోలాకి): మబగాంలో రెండురోజుల పాటు జరగనున్న గ్రిగ్స్ క్రీడలను విజయవంతం చేసేందుకు పీడీలు, పీఈటీలు బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దూర ప్రాంతాల క్రీడాకారులకు భోజన, వసతి కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

కాలువల్లో పూడిక తొలగింపు

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీలో ఎట్టకేలకు పూడికల తొలగింపు కార్యక్రమాలకు ఈవో జగన్నాథరావు శ్రీకారం చుట్టారు. ఏఏ ప్రాంతాల్లో కాలువలు నిండిపోయి మురుగునీరు రోడ్లు మీదకు వస్తుందో గమనించి...వాటి పైకప్పులను తొలగిస్తున్నారు. బుధవారం కంద్రవీధి, జడ్పీ రోడ్డు ప్రాంతంలో డ్రైనేజ్‌లలో పూడికలు తీయించారు. డీఎల్‌పీవో ఐవీ రమణ పరిశీలించారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

పలాస రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆర్డీవో భరత్ నాయక్ అధికారులను ఆదేశించారు. పలాస రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకూ పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ అంశాలు, కోర్టు సమస్యలు, మీకోసంలో వచ్చిన ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ప్రాంతాల వారీగా వినాయక నిమజ్జనం చేసే చెరువులు, వాగుల వివరాలు, వివాదాలు లేకుండా చూడాలని పూజా కమిటీలను ఆదేశించాలని తెలిపారు. సమావేశంలో తహసీల్దారులు బి.సత్యం, ప్రసాద్, సీఎస్‌డీటీలు రవికుమార్, గిరి, డీటీ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో వ్యక్తికి జైలు

వజ్రపుకొత్తూరు: పూండి గోవిందపురం గ్రామానికి చెందిన ఏర్నిబాబు అనే వ్యక్తికి ఓ కేసులో రెండేళ్ల సాధారణ జైలు, రూ.11వేలు జరిమానా విధిస్తూ శ్రీకాకుళంలోని ఎస్సీ, ఎస్టీ కోర్టు తీర్పునిచ్చినట్టు వజ్రపుకొత్తూరు ఎస్ఐ సీహెచ్ రామారావు చెప్పారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఏర్నిబాబు 2019 మార్చి 10న తన భార్యను కొట్టడంతో పొరుగింటికి వెళ్లి తల దాచుకుంది. ఆమెకు ఆశ్రయం ఇచ్చారనే కారణంతో పక్కన ఉన్న పాడల సావిత్రి కుటుంబంపై మరుసటి రోజు ఏర్నిబాబు దాడి చేసి గాయపరిచాడు. సావిత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి హెచ్‌సీ గవరయ్య కేసు నమోదు చేశారు. శ్రీకాకుళం డీఎస్పీ ఎ .సత్యనారాయణ కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసును డిప్యూటీ డైరెక్టర్ మెట్ట మల్లేశ్వరరావు వాదించారు. నిందితుడిపై నేరం రుజువైనందున శిక్ష విధిస్తూ ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి ఎస్ఎం ఫణికుమార్ తీర్పు ఇచ్చారని ఎస్ఐ చెప్పారు.

వృద్ధుడు అదృశ్యం

పాతపట్నం: తెంబూరు గ్రామానికి చెందిన సందిపేట వెంకటరమణ(62) అనే వ్యక్తి ఈ నెల 10 నుంచి కనిపించడం లేదంటూ భార్య కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మెళియాపుట్టిలో ఉన్న తన అక్కచెల్లెళ్ల ఇంటికి వెళ్లి వస్తానని వెళ్లాడని ఫిర్యాదులో పేర్కొన్నట్టు ఎస్ఐ బి.లావణ్య తెలిపారు.

టైపిస్ట్ ఆకస్మిక మృతి

పాతపట్నం ఎంపీడీఓ కార్యాలయంలో టైపిస్టుగా విధులు నిర్వహిస్తున్న టి.ప్రదీప్‌కుమార్(34) బుధవారం ఆకస్మికంగా మృతిచెందాడు. స్థానిక టీచర్స్ కాలనీలో ఉంటున్న ప్రదీప్ బుధవారం ఉదయం అనారోగ్యానికి గురికావడంతో పాతపట్నం సామాజిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. శ్రీకాకుళం తరలించేందుకు ప్రయత్నం చేస్తుండగా మృతిచెందాడు. మృతునికి భార్య చంద్రిక, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డు ప్రిన్సిపాల్ మృతి


శ్రీరాములు (ఫైల్)

ఎచ్చెర్ల: కేశవరావుపేట జంక్షన్ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన ప్రమాదంలో రిటైర్డు ప్రిన్సిపాల్ పూజారి శ్రీరాములు(76) మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇదే మండలం కేశవరావుపేట గ్రామానికి చెందిన ఈయన శ్రీకాకుళం నగరంలో నివాసం ఉంటున్నారు. స్వగ్రామంలోని సచివాలయంలో పని మీద శ్రీకాకుళం నుంచి ఆటోపై వచ్చిన ఆయన కేశవరావుపేట జంక్షన్‌లో దిగి రోడ్డు దాటుతుండగా పాతపట్నం నుంచి విశాఖ వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. శ్రీరాములుకు భార్య పూర్ణమ్మ, కుమారుడు శ్రీనివాసరావు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ బంగ్లాదేశ్ విద్యార్థి..

హరిపురం: మందస మండలం కొర్రాయిగేటు వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బంగ్లాదేశ్‌కు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి మహమ్మద్ ముస్తాక్ టోనీ(20) మంగళవారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బంగ్లాదేశ్‌కు చెందిన మహమ్మద్ ముస్తాక్ టోనీ, మహమ్మద్ హసీబ్ అలాం, ఆసిఫ్ మహమ్మద్ సరో అనే ముగ్గురు విద్యార్థులు ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లోని కేఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. కాగా వీరి స్నేహితుడైన మరో యువకుడు మహమ్మద్ తన్వీర్ రెహ్మాన్ టూరిస్టు వీసాపై ఇండియాకు ఈ నెల 7న వచ్చాడు. నలుగురు కలిసి ఈనెల 9వ తేది రాత్రి రెండు ద్విచక్రవాహనాలపై విశాఖ, చెన్నై సందర్శనకు బయల్దేరారు. మహమ్మద్ ముస్తాక్ టోనీ, మహమ్మద్ తన్వీర్ రెహ్మాన్ ఒక బైక్‌పై వెళ్తుండగా కొర్రాయిగేటు వద్ద అదుపుతప్పి బ్రిడ్జి గోడకు ఢీకొట్టింది. దీంతో తన్వీర్ రెహ్మాన్‌కు స్వల్పగాయాలవ్వగా.. బైక్ నడుపుతున్న ముస్తాక్ టోనికి బలమైన గాయాలవడంతో హరిపురం సీహెచ్‌సీలో చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం టెక్కలి.. ఆ తర్వాత శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. శ్రీకాకుళంలో చికిత్స పొందుతూ టోనీ బుధవారం మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. మందస ఎస్ఐ ఖాదర్ బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వంశధార కాలువలో స్నానానికి దిగి భవానీ భక్తుడు..

ఆమదాలవలస: గాజులకొల్లివలస సమీపంలోని వంశధార కుడి ప్రధాన కాలువలో స్నానానికి దిగి గుండ చంద్రుడు(44) అనే భవానీ భక్తుడు మృతి చెందినట్టు ఎస్ఐ కె.వెం కటేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం రూరల్ మండలం పొన్నాం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ అయిన చంద్రుడు తన ఆటోను మరమ్మతులు చే యించేందుకు పట్టణంలోని వన్‌వే జంక్షన్ వద్దకు తీసుకువ చ్చాడు. మధ్యాహ్నం 12 గంటల సమయం కావడంతో స్నాన మాచరించి భిక్ష చేయాల్సి ఉండడంతో ఒక యువకుడితో కలిసి వంశధార కాలువలో స్నానానికి వెళ్లాడు. లోతు ప్రదేశంలో దిగడంతో మునిగి పోగా వెంటనే పక్కనున్న యువకుడు స్పందించి బయటకు తీసుకురాగా అప్పటికే మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలిం చినట్టు ఎస్ఐ తెలిపారు.

ఇద్దరికి జైలు, జరిమానా

నరసన్నపేట: స్థానిక పురుషోత్తనగర్‌లో పొలం వద్ద 2018లో జరిగిన వివాదం కేసులో ఇద్దరికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ మున్సిఫ్ కోర్టు న్యాయాధికారి హరిప్రియ బుధవారం తీర్పు ఇచ్చారు. ఏపీపీ శాంతిసంతోషి తెలిపిన వివరాల మేరకు.. 2018 పురుషోత్తనగర్ పొలం వివాదంలో తనపై దురుసుగా ప్రవర్తించారని పిరియా సుజాత అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లో హెచ్‌సీ రోజా కుమార్ కేసు నమోదు చేయగా.. ఎస్ఐ నారాయణస్వామి విచారించారు. ఈ కేసులో నిందితులుగా నాగవంశపు త్రినాథరావు, నాగవంశపు శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, సంపతిరావు మన్మధరావుపై కేసు నమోదు చేశారు. బుధవారం ఈ కేసు విచారణలో భాగంగా నాగవంశపు త్రినాథరావు 18 నెలలు జైలు, రూ.2వేలు జరిమానా, నాగవంశపు శ్రీనివాసరావుకు ఆరు నెలలు జైలు, రూ.వెయ్యి జరిమానా విధించగా, లక్ష్మీనారాయణ, మన్మధరావులను నిర్దోషులుగా న్యాయాధికారి ప్రకటించారు. కాగా ఏపీపీ శాంతి సంతోషి ఈకేసును వాదించారు.

గుంతలో ఇరుక్కుపోయిన లారీ.. ట్రాఫిక్‌కు అంతరాయం


గుంతలో కూరుకుపోయిన భారీ వాహనం

బూర్జ: కొల్లివలస జంక్షన్ వద్ద బుధవారం ఉదయం 16 టైర్ల భారీ వాహనం పాలకొండ- శ్రీకాకుళం ప్రధాన రహదారి గుంతలో కూరుకుపోయింది. ఈ బొగ్గు లారీ వల్ల రెండు గంటల పాటు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వాహనచోదకులు, ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఎక్స్‌కవేటర్ సాయంతో లారీని బయటకు తీయించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

కొత్తరోడ్డు వద్ద భారీగా నిలిచిపోయిన వాహనాలు


భారీగా నిలిచిపోయిన వాహనాలు

ఆమదాలవలస: జిల్లా కేంద్రానికి సమీపాన కొత్తరోడ్డు వద్ద ట్రాఫిక్ జామ్‌తో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి కొత్త రోడ్డు ముందర ఉన్న గెడ్డకు అవతల వైపు సుమారు రెండు కిలో మీటరు వరకు ఎక్కడి వాహనాలు నిలిచిపోయాయి. ఆమదాలవలస-శ్రీకాకుళం రహదారి పూర్తిగా మరమ్మతులు కావడంతో గుంతల్లో వర్షపు నీరుచేరడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయి అంతరాయం ఏర్పడింది. అరగంట తర్వాత పెట్రోలింగ్ పోలీసులు అక్కడకు చేరుకొని ట్రాఫిక్‌ను సరిచేశారు.

ఇసుక రీచ్‌లపై ప్రజాభిప్రాయ సేకరణ

శ్రీకాకుళం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఉచిత ఇసుక సేకరణలో భాగంగా రీచ్‌ల నిర్వాహణపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఆర్డీవో రంగయ్య ఆధ్వర్యంలో మైన్స్ అధికారులు బుధవారం బైరి గ్రామంలో ఇసుక రీచ్ నిర్వాహణపై ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించారు. గ్రామంలో ఇసుక రీచ్ నిర్వాహణకు ప్రజలు తమ మద్దతు తెలిపారు. రీచ్ రాకతో పనులు వస్తాయని తమ అభిప్రాయాన్ని అధికారులకు తెలియజేశారు. దీంతో ప్రజల అభిప్రాయంపై నివేదికను కలెక్టర్‌కు నివేదిస్తామని ఆర్డీవో తెలిపారు. కార్యక్రమంలో శంకర్ నాయక్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీలో వైసీపీ నుంచి 35మంది చేరిక

ఇచ్ఛాపురం/ సోంపేట: మున్సిపాల్టీ పరిధి 11వ వార్డులో జన సేన పార్టీ జెండాను పా ర్టీ ఇన్‌చార్జి దాసరి రాజు బుధవారం ఆవిష్కరిం చారు. పార్టీ బలోపేతా నికి ప్రతీ జనసైనికుడు కృషి చేయాలన్నారు. సోంపేట మండలం కంచిలి గ్రామానికి చెందిన వైసీపీ జిల్లా యువజన కార్యదర్శి రాజారావుతో పాటు మరో 35మంది వైసీపీ కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. నాయకులు తిప్పన దుర్యోధనరెడ్డి, హరి బెహరా, కలియా గౌడ్, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

14న ఘంటసాల గానావధానం

శ్రీకాకుళం కల్చరల్: ఈ నెల 14వ తేదీ సాయంత్రం ఐదున్నర గంటలకు స్థానిక బాపూజీ కళామందిర్‌లో డాక్టర్ సయ్యద్ రహమతుల్లా ఘంటసాల గానవధానం, లఘునాటికలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆయనతోపాటు 14 మంది కళాకారులు రానున్నారు. కళాకారులు, కళాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

దశాబ్దాల నాటివే

- ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు
- పట్టించుకోని అధికారులు
- ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతర్

శ్రీకాకుళం రూరల్: దశాబ్దాల కిందట వేసిన విద్యుత్ స్తంభాలు ప్రస్తుతం ప్రమాదకరంగా ఉన్నాయి. పలు గ్రామాల్లో విరిగిపడిపోయేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభాలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలు వాలిపోయి నేలకొరిగేందుకు సిద్ధంగా ఉండగా, మరికొన్ని అడుగు భాగంలో తుప్పు పట్టి పడిపోయేలా ఉన్నాయి. ఇటువంటివి పొలంగట్లపై, మరికొన్ని పాఠశాల వద్ద ఉండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నారు. రూరల్ మండలం మామిడివలస చెరువు గట్టు వద్ద ఉన్న విద్యుత్ స్తంభం వాలిపోగా, మరొకటి గ్రామ పాఠశాల వద్ద స్తంభం అడుగు భాగంలో తుప్పు పట్టి పడిపోడానికి సిద్ధంగా ఉంది. అలాగే సింగుపురం లోని కొప్పలవీధిలో విద్యుత్ స్తంభం తుప్పు పట్టి పడిపో యేలా ఉండడంతో ఎప్పుడు ఎవరిపై పడుతుందో అన్నట్టు ఉన్నా యి. ఇటీవల ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో విరిగి పడిపోయేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభాలను గుర్తించి ప్రభుత్వం అందించిన పంచాయతీ నిధులతో మార్చాలని ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదేశించారు. అయినా విద్యుత్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తుంది. ఇప్పటికైనా ఇటువంటి విద్యుత్ స్తంభాలను మార్చాలని ప్రజలు కోరుతున్నారు.


సింగుపురం కొప్పలవీధిలో కూలేందుకు సిద్ధంగా..


మామిడివలస చెరువు గట్టుపై ఒరిగిపోయిన విద్యుత్ స్తంభం

రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు

- కలెక్టర్ పుండ్కర్, ఎమ్మెల్యే శంకర్
- పెద్దగనగళ్లవానిపేట వద్ద కోతకు గురైన తీర ప్రాంతం పరిశీలన


తీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ పుండ్కర్, ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం రూరల్: నాగావళి నదిలో వరద ఉధృతికి కోతకు గురవుతున్న తీర ప్రాంతాన్ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ బుధవారం సందర్శించారు. ఆంధ్రజ్యోతిలో 'ఉప్పొంగి'నది' శీర్షికతో పెద్దగనగళ్లవానిపేట వద్ద కోతకు గురవుతున్న తీర ప్రాంతంపై కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్‌తో కలిసి బుధవారం ఆ గ్రామానికి వెళ్లి నదీలో బోటుపై వెళ్లి కోతకు గురైన ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. నదీ ప్రవాహం తన దిశను మార్చుకోవడం వల్ల తీరం కోతకు గురవుతుందన్నారు. దీనివల్ల గ్రామానికి కూడా వరద ముప్పు పొంచి ఉందని తెలిపారు. ఈ ప్రాంతంలో రక్షణ గోడ నిర్మాణం చేపట్టి శాశ్వత పరిష్కారం చూపుతామని కలెక్టర్, ఎమ్మెల్యే ప్రజలకు తెలిపారు. అలాగే ఈ ప్రాంతంలో టూరిజం పార్కులను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. అలాగే జెట్టి నిర్మాణానికి కూడా ఆలోచన చేస్తున్నట్టు వివరించారు. పర్యటనలో టూరిజం అధికారి నారాయణరావు, ఆర్డీవో రంగయ్య తహసీల్దార్ ఎస్.గణపతిరావు, కూటమి నాయకులు, మత్స్యకార నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యల నివారణపై అవగాహన

అరసవల్లి: ఒంటరితనం, కుంగుబాటు, మానసిక సమస్యలు ఆత్మహత్యలకు ప్రధాన కారణమని, కరుణ, ప్రేమ చూపించడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించవచ్చని రిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవి వెంకటాచలం, మానసిక విభాగాధిపతి డాక్టర్ వి.పద్మ అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం పురస్కరించుకుని బుధవారం స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రోగుల బంధువులు, నర్సింగ్ విద్యార్థులకు, వైద్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. పీజీ వైద్య విద్యార్థులు ఆత్మహత్యలకు గల కారణాలు, చికిత్సలు, నివారణా మార్గాలను వివరిస్తూ నాటిక ద్వారా అవగాహన కల్పించారు. జీజీహెచ్‌లో ఓపీ నెంబర్ - 17లో మానసిక సమస్యల పరిష్కారానికి, చికిత్సలు, వైద్య నిపుణుల కౌన్సిలింగ్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

అటవీ అమరవీరులకు నివాళి


అమరవీరులకు నివాళులర్పిస్తున్న దృశ్యం

అరసవల్లి: అటవీ సంపద, వణ్యప్రాణుల సంరక్షణలో తమ ప్రాణాలను త్యాగం చేసిన అటవీ అమరవీరులను స్మరిస్తూ జాతీయ అటవీ అమరవీరుల దినాన్ని నగరంలోని జిల్లా ఫారెస్ట్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో అశువులు బాసిన అమరవీరులకు సబ్ డీఎఫ్‌వో నాగేంద్ర, సిబ్బంది నివాళులర్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు పి.అమ్మన్నాయుడు, ఆర్.రాజశేఖర్, ఎం.నిహారిక, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

పది పరీక్షలపై గందరగోళం తొలగించాలి

పొందూరు: రాష్ట్రంలో 2024-25 విద్యా సంవత్సరంలో నిర్వహించే పది పరీక్షల మాధ్యమంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల్లో నెలకొన్న గందరగోళాన్ని రాష్ట్ర ప్రభుత్వం తొలగించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రశన్న కోరారు. తాడివలసలో ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2022లో అప్పటి వైసీపీ ప్రభుత్వంలో 1 నుంచి 10 వతరగతి వరకు సింగిల్ మాధ్యమంలో(ఆంగ్లం) బోధించాలంటూ విద్యాశాఖ 84, 85 జీవోలు జారీ చేసిందని, 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 2025లో జరిగే పదో తరగతి పరీక్షలు విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలో పరీక్షలు రాయాలని అప్పట్లో విద్యాశాఖ జీవోల్లో పేర్కొందన్నారు. ఈ జీవో మాతృభాషా మాధ్యమానికి ఆటంకమంటూ గుంటుపల్లి శ్రీనివాసరావు, డబ్బీరు రమేష్ పట్నాయక్ హైకోర్టులో కేసు వేశారని, కేసు విచారణలో ఉందని తెలిపారు. రెండు మాధ్యమాల్లో నిర్వహించేందుకు అప్పట్లో ప్రస్తుత మానవవనరులశాఖ మంత్రి హామీ ఇచ్చినా ఇప్పటివరకు రాష్ట్ర అధికారులు స్పష్టత ఇవ్వకపోవడంతో గందరగోళం నెలకొందని ప్రభుత్వం తక్షణమే దీనిపై స్పష్టత ఇవ్వాలని కోరారు.

యోగ పోటీలకు ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ఎంపిక


డైరెక్టర్ బాలాజీ, ఇతర అధికారులతో ఎంపికైన విద్యార్థులు

ఎచ్చెర్ల: ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖ జిల్లా భీమిలిలో జరగనున్న రాష్ట్ర స్థాయి అండర్-16, అండర్-18 యోగ పోటీలకు ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ క్యాంపస్ నుంచి 24 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా క్యాంపస్ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించి ఆర్జీయూకేటీ ప్రతిష్ఠను ఇనుమడింపజేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో ముని రామకృష్ణ, డీన్ కొర్ల మోహనకృష్ణ చౌదరి, యోగా విభాగాధిపతి ఈశ్వరరావు, యోగా అధ్యాపకులు అర్చన, ధనుంజయరావు, వెల్ఫేర్ డీన్ గేదెల రవి, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కంచిలి: సీజనల్ వ్యాధులపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో వి.నీరజ అన్నారు. బూరగాం గ్రామంలో బుధవారం నీటి నమూనాలు సేకరించారు. ప్రజలు వినియోగిస్తున్న కొళాయిలు, బావులు, ట్యాంకుల నుంచి నీటిని సేకరించి పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అంటురోగాలు ప్రబలే ప్రమాదం ఉంటుందని, ప్రజలు తాగేందుకు వేడి నీళ్లు వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మోహన్, సల్మాన్, చాణక్య తదితరులు పాల్గొన్నారు.

జీవో 85పై పునరాలోచన చేయాలి

జి.సిగడాం/ పొందూరు: జీవో నెంబరు 85పై ప్రభుత్వం పునరాలోచ చేయాలని పీహెచ్‌సీ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షులు, తాడివలస పీహెచ్‌సీ వైద్యులు జి.రమేష్‌నాయుడు అన్నారు. పీహెచ్‌సీ వైద్యుల సంఘం పిలుపు మేరకు బుధవారం జి.సిగడాం, పొందూరు మండలాల్లోని జి.సిగడాం, బాతువ, తాడివలస, కింతలి పీహెచ్‌సీల్లో వైద్యులు నల్లబాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 85 జీవో వల్ల వైద్యుల సర్వీసులకు అర్థం లేకుండా పోయిందన్నారు. వైద్యుల పీజీ అవకాశాలు తగ్గించడం అన్యాయమన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 16 నుంచి నిరవధిక దీక్ష చేస్తామని హెచ్చరించారు. బి.అనూష, ప్రతిష్ఠశర్మ, యశ్వంత్, సుమబిందు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


రఘురామ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

జి.సిగడాం: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. అనారోగ్యానికి గురైన అనందపురం గ్రామానికి చెందిన బీజేపీ మండల అధ్యక్షుడు వజ్జపర్తి రఘురామ్‌ను బుధవారం ఆయన పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని సమస్యలను గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే టీడీ వలస గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు సానుబిల్లి గోపాలనాయుడు తండ్రి ఇటీవల మృతి చెందగా.. ఆ కుటుంబాన్ని పరామర్శించారు. నాయకులు కుమరాపు రవికుమార్, టంకాల మౌళీశ్వరరావు, టి.కిషోర్, కంచరాన సూరన్నాయుడు, బూరాడ వెంకటరమణ, పొగిరి పాపారావు, సాకేటి నాగరాజు, పి.దాశరథి, కామోజుల సీతారాం, బెవర జగన్నాధరావు, బోగాది అప్పలనాయుడ, కోన వెంకటరావు, గోల్లాజీ, బాలబోమ్మ వెంకటేశ్వరావు తదితరులు ఉన్నారు.

సహారా బాధితులకు న్యాయం చేయాలి

సోంపేట: సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు 15శాతం వడ్డీతో సహారా బాధితులకు న్యాయం చేయాలని ఆ సంఘ నాయకులు కోరారు. పట్టణంలో బుధవారం బాధితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం రీజన్‌లో సుమారు రూ.500కోట్లు సహారా సంస్థ ద్వారా ఇవ్వాల్సి ఉందని దీనిని ఇప్పించే ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో బి.సత్యరాజు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.

ఎన్‌వోసీ లేకుండా బంకు నిర్మాణంపై జేసీ ఆగ్రహం


రికార్డులు పరిశీలిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

సరుబుజ్జిలి: ఒప్పదాం గ్రామ సమీపంలో ఏర్పాటు చేయనున్న పెట్రోల్ బంకు స్థల పరిశీలనకు బుధవారం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ వివిధ శాఖ అధికారులతో కలిసి తనిఖీ చేపట్టారు. ఆలికాం-బత్తిలి ప్రధాన రహదారి అనుకొని ఏర్పాటు చేయనున్న ఈ పెట్రోల్ బంక్ నిర్మాణానికి వివిధ శాఖల నుంచి ఎన్‌వోసీ తీసుకోవాల్సి ఉంది. అదేమీ లేకుండానే బంకు నిర్మాణాలు చేపట్టడాన్ని జేసీ గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే నిర్మాణదారుకు నోటీసులు జారీ చేయాలని తహసీల్దార్ ఎల్.మధుసూదన్‌ను జేసీ ఆదేశించారు. తిరిగి ఆదేశాలు ఇచ్చేవరకు బంకు నిర్మాణం చేపట్టవద్దని సూచించారు. డీఎస్‌వో బి.శాంతిశ్రీ, ఎంపీడీవో మురళీ మోహన్‌కుమార్, సీఎస్‌డీటీ కిషోర్, ఎంఆర్ఐ బాబూరావు పాల్గొన్నారు. కాగా జేసీ ఆదేశాల మేరకు బంకు నిర్మాణదారుకు తక్షణమే నోటీసు జారీ చేశామన్నారు.

చల్లపేట వద్ద స్థల పరిశీలన..

గార: అంపోలు పంచాయతీ చల్లపేట వద్ద ఏర్పాటు చేయనున్న పెట్రోల్ బంక్‌కు అవసరమైన, అనువైన స్థలాన్ని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సంబంధిత అధికారులతో కలిసి బుధవారం ఉదయం పరిశీలించారు. బంక్ ఏర్పాటు నిబంధనల మేరకు ఉండాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్‌వో బి.శాంతిశ్రీ, తహసీల్దార్ ఎస్.రమణారావు, ఆర్ఐ అనిల్‌కుమార్, వీఆర్వో నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ ఎస్పీగా బర్ల ప్రసాద్


బర్ల ప్రసాద్

శ్రీకాకుళం క్రైం: శ్రీకాకుళం జిల్లా విజిలెన్స్ ఎస్పీగా బర్ల ప్రసాదరావు నియమితులయ్యారు. ఇటీవల పోలీసుశాఖలో జరిగిన పదోన్నతుల్లో భాగంగా ఆయనకు ఎస్పీగా పదోన్నతి కలిగింది. ఈ మేరకు ఆయనకు శ్రీకాకుళం జిల్లా బదిలీ అయింది. ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు. గతంలో శ్రీకాకుళం జిల్లాలో సీఐగా ఆయన పని చేశారు.

కొబ్బరి రైతులను ఆదుకోవాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్

కవిటి: ఉద్దానం ప్రాంత కొబ్బరి రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. కవిటిలో బుధవారం బీవీకే కవిటి మండల రైతు ఉత్పత్తిదారుల సంస్థ సమావేశాన్ని నిర్వహించారు. కూటమి ప్రభుత్వం కొబ్బరి రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపడుతున్నారు. భారత్ కిసాన్ సంఘ్ కార్యవర్గ సభ్యుడు జేకుమారస్వామి, వ్యవసాయశాఖ ఏడీ జగన్మోహన్‌రావు, ఏవో నరసింహమూర్తి, బిక్షష్టారావు పాల్గొన్నారు.

అప్రంటీస్ మేళాలో 45 మంది ఎంపిక

ఎచ్చెర్ల: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో బుధవారం అప్రంటీస్ మేళాను నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఐటీఐ ఉత్తీర్ణులైన 177 మంది అప్రంటీస్ మేళాలో పాల్గొన్నారు. వివిధ కంపెనీల్లో 53 ఖాళీలు ఉండగా.. 45 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా అడ్మిషన్ల కన్వీనర్ ఎల్.సుధాకరరావు, ఐఎంసీ ఛైర్మన్ వి.మూర్తి, డీఎల్‌టీసీ ఏడీ వై.రామ్మోహన్, ట్రైనింగ్ ఆఫీసర్ పి.విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్‌గా అమరేంద్రకుమార్



నూజివీడు టౌన్: రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ (ఆర్జీయూకేటీ) రిజిస్ట్రార్‌గా అమరేంద్రకుమార్‌ను నియమిస్తూ వైస్ చాన్స్‌లర్ విజయ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్ సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న సంద్ర అమరేంద్ర కుమార్‌ను రిజిస్ట్రార్‌గా నియమించారు. 2016లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా ట్రిపుల్ ఐటీలో చేరిన ఆయన 2021లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. అనంతరం ఆర్కే వ్యాలీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్, డైరెక్టర్‌గా పని చేయడంతో పాటు ఇటీవల ట్రిపుల్ ఐటీ అడ్మిషన్లకు కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆయనను రిజిస్ట్రార్‌గా నియమించడంపై నాలుగు ట్రిపుల్ ఐటీల అధికారులు, అధ్యాపకులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఆమదాలవలస/ఎచ్చెర్ల: గాజులకొల్లివలసలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మునగవలస, గాజుల కొల్లివలస ఫీడర్ల పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ ఎస్.బయ్యన్నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాజులకొల్లివలస, చిన్న జొన్నవలస, పెద్దజొన్నవలస, మునగవలస, రాధా కృష్ణాపురం, రామచంద్రాపురం, పొన్నంపేట, చిట్టివలస, సైలాడ, కుమ్మరిపేట, చవ్వాకులపేట, అక్కులపేట, తాళ్లవలస, మండాది తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందన్నారు. ఎచ్చెర్ల మండలంలో చిలకపాలెం 132/32 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని ధర్మవరం, కొయ్యాం, కేకే నాయుడుపేట, డి.మత్స్యలేశం, కుప్పిలి, బడివానిపేట, నిమ్మవానిపేట, భగీరథపురం, పొన్నాడ, ముద్దాడ శుక్రవారం గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు.

15న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

శ్రీకాకుళం స్పోర్ట్స్: జిల్లాలో తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా వాయిదా పడిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు ఈ నెల 15న నిర్వహించనున్నట్టు అసోసియేషన్ జిల్లా ఛైర్మన్ కొన్న వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ పోటీలు ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం ఉదయం నుంచి జరగనున్నట్టు తెలిపారు. అండర్-14, 16. 18, 20 విభాగాల్లో పోటీలు జరుగుతాయని, మరిన్ని వివరాలకు సంఘ కార్యదర్శి ఎం.సాంబమూర్తిను సంప్రదించాలన్నారు

సమస్యలు పరిష్కరిస్తా

ఇచ్ఛాపురం: మాజీ సైనికోద్యోగుల సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. బుధవారం మాజీ సైనికోద్యోగుల కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యేను సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. 2018లో టీడీపీ ప్రభుత్వంలో 36మంది మాజీ సైనికోద్యోగులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేశారని, ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో అవి నిలిచిపోయాయన్నారు. మాజీ సైనికోద్యోగులు నారాయణ, దక్కత విశ్వనాథంరెడ్డి, యు.శంకరరావు, ఎం.హరి, సీపీ బ్రహ్మం, దుర్గారావు, శుఖర్, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో సత్తాచాటండి

శ్రీకాకుళం స్పోర్ట్స్: తమిళనాడు రాష్ట్రం దిండిగల్ వేదికగా ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు జరుగుతున్న జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకా రులు సత్తాచాటాలని అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తైక్వాండో శ్రీను సూచించారు. బండి శిరీష, జి.దుర్గాభవాని, ఎస్.నవ్య, వి.జాస్మిన్, సీహెచ్ సంధ్యారాణి, ఆర్.హసిని, ఎల్.జగదీశ్వరి జాతీయ పోటీల్లో పాల్గొన్నారు. విజయంతో తిరిగి రావాలని వైశ్యరాజు మోహన్, జి.వెంకటేశ్వరరావు, ఎం.సుధీర్ వర్మలు అభినందించారు. టీమ్ కోచ్‌లుగా మజ్జి గౌతమ్, మొర్తాసాయిబాలాజీ వ్యవహరిస్తున్నారు.

నీటి పరీక్షలు తప్పనిసరి

జి.సిగడాం: సీజన్ వ్యాధులు దృష్ట్యా గ్రామాలలో నీటి పరీక్షలు తప్పని సరిగా చేయాలని ఎంపీడీవో కె నిశ్చల అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నీటి పరిక్షలను నిర్వహించారు. తాగునీటి బోర్లు, రక్షిత మంచి నీటి పదకాలు, నేల బావులు వద్ద నీటిని సేకరించి నీటి పరిక్షలు చేసి నీటి నాణ్యతను గుర్తించాలన్నారు. వీఆర్వో భూపతి నర్సింగరావు, డీవో పొగిరి రాము, పంచాయితీ కార్యదర్శి సాహూ తదితరులు ఉన్నారు.

విపత్తుల నిర్వహణపై శిక్షణ

అరసవల్లి: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై స్థానిక రెడ్‌క్రాస్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆవరణలో మొదటి బ్యాచ్‌కు శిక్షణ కార్యక్రమం బుధవారం నాటితో ముగిసింది. ఏడీఎఫ్ ఎం.వరప్రసాద్ తమ బృందంతో తర్ఫీదునిచ్చారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.జగన్మోహన్‌రావు, సెక్రటరీ బలివాడ మల్లేశ్వరరావు, వైస్ ఛైర్మన్ కె.సుధీర్, రెడ్‌క్రాస్ సేవకులు, పలు స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు, పాల్గొన్నారని ప్రోగ్రాం మేనేజర్ రమణ తెలిపారు.

వంద రోజులు పూర్తిచేయాలి

లావేరు: ఉపాధి వేతనదారులకు 100 రోజుల పనులు పూర్తి చేయాలని ఎంపీడీవో కె.సురేష్ కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. అదే విధంగా మండలంలో 25 వేల మొక్కలు నాటి లక్ష్యాలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో ఆర్ సత్యవతి, జేఈ లెలిన్‌బాబు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పాత గృహ నిర్మాణాల గుర్తింపు

సరుబుజ్జిలి: గ్రామ పంచాయతీలో గత టీడీపీ పాలనలో నిర్మాణాలు జరిగి బిల్లులు అందక ఉన్న గృహ నిర్మాణాలను మండల గృహ నిర్మాణశాఖ సర్వే నిర్వహిస్తోంది. ఈ మేరకు బుధవారం సరుబుజ్జిలి గ్రామ పంచాయతీల్లో గృహ నిర్మాణశాఖ అధికారులు, టీడీపీ నాయకులు ఎండ రామారావు, రాకోటి శ్రీరామ్మూర్తి, బెండి శ్రీనివాసరావు బిల్లులు అందక ఉన్న గృహ నిర్మాణ లబ్ధిదారుల వివరాలను సేకరించడం జరిగింది.

పంట పొలాలు పరిశీలన

ఇచ్ఛాపురం: ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు చాలా గ్రామాల్లో పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. దీంతో బుధవారం ఇన్నేసుపేట, రత్తకన్న గ్రామాల్లో నీటమునిగిన పంట పొలాలను కేవీకే ఆమదాలవలస శాస్త్రవేత్తలు హరికుమార్, కిరణ్‌కుమార్ పరిశీలించారు. వీలైంత వరకు పొలంలోని అధిక నీటిని తొలగించి, ఎకరాకు 25 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ చొప్పున్న చల్లించాలని సూచించారు.

వేడుకగా రాధాష్టమి

కంచిలి: స్థానిక శ్రీకృష్ణాలయంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు ఆధ్వర్యంలో బుధవారం రాధాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతం, గోపూజ, హోమాలు, పవళింపు సేవలో గ్రామానికి చెందిన మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. పూజల అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. ఇప్పిలి కృష్ణారావు, నర్తు చామంతి, సాలీన లక్ష్మణరావు పాల్గొన్నారు.